

సికిల్‌సెల్‌పై అవగాహన

సికిల్‌సెల్ అనీమియాపై అన్ని మండలాల్లో అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని డీఎంహెచ్‌ఓ అన్నారు. - 10లో



భక్తులకు ఇబ్బందులు కలిగించొద్దు

కాణిపాకం ఆలయంలో భక్తులకు ఇబ్బందులు లేకుండా సదుపాయాలు కల్పించాలని ఆర్‌జేసీ కోరారు. - 10లో



టోకెన్ ఉన్న రైతులకే అనుమతి

టోకెన్ల కోసం వరుసలో నిలబడిన రైతులకే అనుమతి ఉంటుందని, రైతులు సహనం పాటించాలని ఎస్పీ కోరారు. - 10లో

న్యూస్‌రీల్

నేడు అగ్నివీర్‌పై అవగాహన

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా కేంద్రంలోని నాగయ్య కళాక్షేత్రంలో 19న అగ్నివీర్ వాయు పథకంపై అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు ఇంచార్జి కలెక్టర్ విద్యాధరి తెలిపారు. బుధవారం ఆమె విలేకరులతో మాట్లాడారు. భారత వైమానిక దళం ఆధ్వర్యంలో యువతకు అగ్నివీర్‌పై అవగాహన కల్పించనున్నట్లు చెప్పారు. కార్యక్రమానికి 12వ ఎయిర్‌మెన్ సెలక్షన్ సెంటర్ సికింద్రాబాద్ నుంచి ఇండియన్ ఎయిర్‌ఫోర్స్ అధికారులు విచ్చేస్తారన్నారు. భారత వైమానిక దళంలో ఉండే వివిధ ఉద్యోగ అవకాశాలు, అగ్నివీర్ పథకం విషయాలపై అవగాహన కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని చెప్పారు. జిల్లాలోని యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఇంచార్జి కలెక్టర్ కోరారు.

వాయిదా వేసిన డీఎస్సీ పరీక్షలు జులైలో నిర్వహణ

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా వ్యాప్తంగా ఈనెల 20, 21 తేదీల్లో నిర్వహించాల్సిన డీఎస్సీ పరీక్షలు వాయిదా వేశారని డీఈఓ వరలక్ష్మి తెలిపారు. బుధవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ.. ఈనెల 21వ తేదీన అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని నిర్వహిస్తున్నందున 20, 21 తేదీల్లో నిర్వహించే డీఎస్సీ పరీక్షలను వాయిదా వేశారన్నారు. వాయిదా వేసిన పరీక్షలను తిరిగి జులై 1, 2 తేదీల్లో నిర్వహిస్తారన్నారు. మారిన పరీక్ష కేంద్రాలు, తేదీలతో హాల్ టికెట్లు ఈనెల 25వ తేదీ నుంచి https://apdsc.apcfsc.in వెబ్‌సైట్‌లో అందు బాటులో ఉంటాయని డీఈఓ వెల్లడించారు.


డీపీటీఓగా రాము

చిత్తూరు రూరల్ (కాణిపాకం) : చిత్తూరు నగరం ఆర్టీసీ బస్టాండులోని కార్యాలయంలో బుధవారం డీపీటీఓగా రాము బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న జగదీష్ తిరుపతి డీపీటీఓగా బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో రాము బాధ్యతలను స్వీకరించారు.

అప్రెంటీస్‌కు దరఖాస్తుల ఆహ్వానం

తిరుపతి ఎడ్యుకేషన్ : టీటీడీ రవాణా శాఖలో ఏడాది పాటు అప్రెంటీస్ చేయడానికి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు తిరుచానూరు రోడ్డు, పద్మావతిపురంలోని ప్రభుత్వ ఐటీఐ కళాశాల ప్రిన్సిపల్/కన్వీనర్ పి.గణేష్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ అప్రెంటీస్‌కు తిరుపతి, చిత్తూరు జిల్లాల్లోని ప్రభుత్వ, ప్రైవేటు ఐటీఐ కళాశాలల్లో మెకానిక్ మోటార్ వెహికల్, ఎలక్ట్రీషియన్ ట్రేడ్లలో పాసైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవడానికి అర్హులన్నారు. పది, ఐటీఐ విద్యార్హత సర్టిఫికెట్లు, ఆధార్, బ్యాంక్ పాస్‌బుక్, మొబైల్ నంబరు, మెయిల్ ఐడీ, పాన్ కార్డు, కుల ధ్రువీకరణ పత్రం, రెండు పాస్‌పోర్ట్ సైజు ఫొటోలతో ఈ నెల 30వ తేదీలోపు ప్రభుత్వ ఐటీఐ కళాశాలలోని అప్రెంటీస్‌షిప్ అడ్వైజర్ సి.గంగాధరానికి దరఖాస్తులను సమర్పించాలన్నారు. పూర్తి వివరాలకు 94416 47174, 95507 22922 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

డీఈఓకు డైట్ ప్రిన్సిపల్‌గా అదనపు బాధ్యతలు



వరలక్ష్మి, డీఈఓ

కార్వేటినగరం : చిత్తూరు డీఈఓగా విధులు నిర్వహిస్తున్న బి.వరలక్ష్మికి జిల్లా విద్యాశిక్షణా సంస్థ (డైట్) ప్రిన్సిపల్‌గా అదనపు బాధ్యతలు అప్పగించారు. గతంలో డైట్ ప్రిన్సిపల్‌గా విధులు నిర్వహిస్తున్న డాక్టర్ శేఖర్ గత నెల 30న పదవీ విరమణ పొందారు. ఇక ఏకైక సీనియర్ అధ్యాపకుడిగా విధులు నిర్వహిస్తున్న ఎస్.సుబ్రమణ్యం అన్నమయ్య జిల్లా డీఈఓగా వెళ్లడంతో కార్వేటినగరం డైట్ ప్రిన్సిపల్‌గా చిత్తూరు డీఈఓ వరలక్ష్మికి అదనపు బాధ్యతలను ప్రభుత్వం అప్పగించిందని, త్వరలో బాధ్యతలు చేపట్టనున్నట్లు తెలిపారు.



చిత్తూరు మార్కెట్‌కు వచ్చిన మామిడి కాయలు

మామిడి రైతు దిగుబడులను విక్రయించేందుకు అగచాట్లు పడుతున్నారు. పంట్లు పక్వానికి వచ్చినా కోయలేక అన్నదాతలు విలవిలలాడుతున్నారు. ఫ్యాక్టరీలు, ర్యాంపులు కాయలు కొనడానికి ముఖం చాటేయడంతో ఆవేదన చెందుతున్నారు. అధికారుల చెప్పిన రేటు ఎక్కడా అమలు కావడంలేదని ఆందోళన చెందుతున్నారు. మరోవైపు కాయలు తీసుకొనేందుకు జులై వరకు టోకెన్లు ఇవ్వడంపై అన్నదాతలు మండిపడుతున్నారు. తోటల్లో కాయ పక్వానికి వచ్చి రాలిపోతుంటే...గడువు మరో 15 రోజుల వరకు ఇవ్వడం ఏంటని నష్ట పరిహారం ఇవ్వకపోతే ఆత్మహత్యలే శరణ్యమని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మామిడి విలవిల

- పంటను అమ్ముకోవడానికి ఫలరాజు పాట్లు
- అన్నదాతలకు కోతల కన్నీళ్లు
- ముఖం చాటేస్తున్న ఫ్యాక్టరీలు.. చివరికి ర్యాంపులూ
- రాలిపోతున్న కాయలు.. నష్ట పరిహారం ప్రకటించాలి

కాణిపాకం : జిల్లాలో మామిడి విపత్తు ఎదురవుతోంది. రైతులు ఆరుగాలం శ్రమించి పండించిన పంటను అమ్ముకోవడానికి పడరాని పాట్లు పడుతున్నారు. పంట పక్వానికి వచ్చినా కోతలు కోయలేక కన్నీళ్లు పెడుతున్నారు. ఫ్యాక్టరీలు ముఖం చాటేస్తున్నాయి. ర్యాంపులు ఇదే దారిలో పయనిస్తూ... కాయలను కొనలేమని చేతులెత్తేస్తున్నాయి. టోకెన్లు గడువు ఉన్నంత వరకు కాయలకు గడువులేదని... ప్రభుత్వం ప్రోత్సాహక నిధి ప్రకటించి రైతుల గోసను గాలికొదిలేసిందని రైతులు ఆక్రోశానికి గురవుతున్నారు.

టోకెన్ ఉన్న రైతుల పరిస్థితి ఇదీ..

మామిడి రైతులు పండించిన పంట విక్రయానికి జిల్లాలోని ఫ్యాక్టరీల వద్దకు పోటెత్తుతున్నారు. వేల మంది రైతులు ఒక్కసారిగా ఫ్యాక్టరీలను ముట్టడిస్తున్నారు. ఈపోరు పడలేక ఫ్యాక్టరీలు, అధికారులు కలిసి వచ్చిన వారి అందరికీ టోకెన్లు పంచిపెట్టేస్తున్నారు. ఈ టోకెన్ల జారీ జూన్ నెల దాటింది. పలు ఫ్యాక్టరీలు జులై నెల ఆఖరు వరకు కొనుగోలు చేస్తామని టోకెన్లు ఇచ్చేసింది. మరో వారం..పది రోజుల్లో మామిడి పంట పూర్తిగా నేల మట్టమయ్యే అవకాశం ఉందని రైతులు కంట తడి పెడుతున్నారు. ఇలాంటి తరుణంలో జులై నెల ఆఖరు వరకు పంట ఉండదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాయ పండై...పురుగు పట్టి రాలిపోవడం ఖాయమని కన్నీళ్లు కారుస్తున్నారు. ఇప్పటి వరకు 30 శాతం వరకు మాత్రమే పంట అమ్ముడుబోయినట్లు రైతులు చెబుతున్నారు. ఫ్యాక్టరీలకు వచ్చిన సగం కాయలు తమిళనాడు కాయలని, వాటిని కూడా అధికారులు ఈ లెక్కల్లోనే కలిపేస్తున్నారని రైతులు వాపోతున్నారు.

నష్టపరిహారం ఇవ్వాల్సిందే...

మామిడి పంటను కోసి అమ్ముకునే పరిస్థితి లేదని రైతులు దిగాలు చెందుతున్నారు. ఫ్యాక్టరీలు జిల్లా మామిడిని తోసి పుచ్చుతున్నాయంటూ గోల చేస్తున్నారు. సిఫార్సులకు పెద్దపీట వేస్తూ...సామాన్య రైతు కష్టాన్ని పట్టించుకోవడం లేదని మండిపడుతున్నారు. ప్రస్తుతం ఫ్యాక్టరీల వద్ద ఇబ్బంది పడుతోంది... సామాన్య రైతులేనని వారు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం నిర్ణయించిన ధర ప్రకారం కొనాలంటే..మాకేమి లాభమని...ఫ్యాక్టరీలు పక్క రాష్ట్రాల కాయలపై మొగ్గు చూపుతున్నాయంటూ ఆగ్రహానికి గురవుతున్నారు. ఫ్యాక్టరీలు రూ.5, రూ.6ను కూడా తగ్గించేందుకు కుట్రలు చేస్తున్నాయని రైతులు ఆరోపిస్తున్నారు. ఈ తరుణంలో ప్రోత్సాహక నిధిని పక్కన పెట్టి మామిడి కష్టాలను విపత్తుగా గుర్తించి రైతులకు పూర్తి స్థాయిలో నష్టపరిహారం అందించి ఆదుకోవాలని పలువురు రైతులు డిమాండ్ చేస్తున్నారు.

2018 నష్టాలు గుర్తుకొస్తున్నాయి..

ప్రస్తుతం మామిడి పరిస్థితి చూసి రైతులు 2018 మామిడి సంఘటనను గుర్తు చేసుకుంటున్నారు. అప్పట్లో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 40 శాతం పంట మాత్రమే వచ్చింది. ఆ పంటను విక్రయించుకోవడానికి అప్పటి రైతులు నానా అవస్థలు పడ్డారు. ఆ సమయంలో ఫ్యాక్టరీలు మామిడి పంటను కొనలేని పరిస్థితి ఏర్పడితే రైతులు పండిన తోతాపురి కాయలను తీసుకొచ్చి కలెక్టరేట్ ఎదుట రోడ్డుపై పోసి నిరసనకు దిగారు. చివరకు కేజీ తోతాపురి రూ.2 వరకు పలికింది. అప్పటి కూడా కొనలేని పరిస్థితులు ఉంటే 30శాతం నుంచి 40శాతం పంట చెట్లల్లోనే రాలిపోయాయి. కాగా అప్పట్లో ఫ్యాక్టరీలకు 20,053 మంది రైతులు 1,04,777 టన్నుల కాయలను విక్రయించారు. ఇందుకు గాను ఫ్యాక్టరీలు రూ.78.58 కోట్లు రైతులకు ఇవ్వాల్సి ఉంటే 8 నెలల తర్వాత బిల్లులు చెల్లించాయి. అప్పట్లో అధికారంలో ఉన్న టీడీపీ ప్రభుత్వం ప్రకటించిన ప్రోత్సాహక నిధి రూ.2.50 చొప్పున రూ.2.19 కోట్ల నిధులు చెల్లింపుల్లో జాప్యం చోటు చేసుకున్నాయి. ఈ కారణంగా రైతులు అప్పులు చేసి తీవ్రంగా నష్టపోయారు. మళ్లీ అలాంటి పరిస్థితి ఎదురు కావడంతో రైతుల్లో గుబులు పట్టుకుంటోంది.

చేతులెత్తేసిన ర్యాంపులు

జిల్లాలో ఇప్పటి వరకు 23 ర్యాంపులు నడుస్తున్నాయి. ఈ ర్యాంపులకు రోజువారీగా ఒక్క లారీ నుంచి రెండు లారీలా వరకు ఫ్యాక్టరీలకు అమ్ముకోవడానికి అనుమతులున్నాయి. ఈ ర్యాంపును నిర్వర్తించే వ్యాపారులు సొంత కాయలు, బంధువులు, తెలిసినా వాళ్ల మామిడి కాయలు అమ్ముకోవడానికి మాత్రమే ప్రాధాన్యం ఇస్తున్నారు. మిగిలిన రైతుల మామిడిని కొనలేమని, ఫ్యాక్టరీ వాళ్లు తీసుకోవడం లేదని తలుపులు వేసేస్తున్నారు. ర్యాంపులకు వెళ్లిన రైతులకు వారం తర్వాతే కాయలు కొంటామని చెప్పేస్తున్నారు. అధికారులు చెప్పిన రేటు (రూ.3.50) కుదరదని, రూ.3 నని, మరో వారం తర్వాత ఆ రేటు చెప్పలేమని రైతులకు సమాధానమిస్తున్నారు. దీంతో మామిడి రైతులు తల్లడిల్లిపోతున్నారు.

ఒక్క టోకెన్ స్వామీ !

జిల్లాలో మామిడి రైతుల పరిస్థితి అయోమయంగా మారింది. ఫలంపై ఆశలు వదులుకోవాల్సిన దుస్థితి ఏర్పడింది. తోటలోని కాయలు మట్టిపాలవుతున్నాయి. రైతులు ఫలం పరిస్థితి చూసి కన్నీళ్లు కారుస్తున్నారు. చాలా మంది కాయలను అమ్ముకోవడానికి ఫ్యాక్టరీల వద్దకు పరుగులు పెడుతున్నారు. వారి అనుమతి కోసం బంగారుపాళ్యం, చిత్తూరు, గుడిపాల, పెనుమూరు, పూతలపట్టు, తవణంపల్లి, జీడీ నెల్లూరు తదితర ప్రాంతాలకు తిరిగేస్తున్నారు. తెలిసిన వ్యక్తులు, పలుకుబడి ఉన్న వ్యక్తులు, కూటమి నేతలు, పలుశాఖ అధికారుల ద్వారా టోకెన్ల కోసం బతిమిలాడుకుంటున్నారు. ఒక్క టోకెన్ అయినా తీసి ఇవ్వు స్వామీ అంటూ రైతులు వారిని ప్రాధేయపడుతున్నారు.

నష్ట పరిహారం ఇవ్వాలి



ఈసారి మామిడి రైతు నిండా నష్టపోయాడు. మామిడి సాగు ఖర్చులు, కూలీల ఖర్చులు, ట్రాక్టర్ ఖర్చులు కలిసి రైతులను ముంచేస్తున్నాయి. కాయలు తీసుకొచ్చేందుకు ట్రాక్టర్‌కు ఒక్క రోజుకు రూ.1000 బాడుగ ఇస్తున్నాం. బండి మూడు రోజులు ఇక్కడే ఉంది. రోజుకు రూ.1000 చొప్పున మూడు రోజులకు రూ.3 వేలు ఇవ్వాలి. కోసి తీసుకొచ్చింది కొంత వరకు మాత్రమే. మిగిలిన కాయలు చెట్లల్లో అలానే ఉన్నాయి. జులై వరకు టోకెన్లు ఇస్తున్నా, అప్పటి వరకు చెట్లల్లో కాయలు ఉండవు. నష్టపరిహారం ఇచ్చి ఆదుకోవాలి. – వెంకటేష్, పెనుమూరు



చిత్తూరు నగరంలోని ఓ ఫ్యాక్టరీ వద్ద మామిడి కాయల ర్యాంప్



తవణంపల్లె: ఎఫ్-3 ఫ్యాక్టరీ వద్ద మామిడి కాయలు అన్‌లోడ్ చేయడానికి క్యూ కట్టిన ట్రాక్టర్లు

జగనన్న సునామీని అడ్డుకోలేరు

- మృతుల కుటుంబాన్ని పరామర్శించడానికి వెళ్లడం తప్పా?
- మాజీ మంత్రి ఆర్కేరోజా



మాట్లాడుతున్న మాజీ మంత్రి ఆర్కేరోజా

నగరి : జగనన్న అభిమాన సునామీని ఎవరూ అడ్డుకోలేరని మాజీ మంత్రి ఆర్కేరోజా అన్నారు. బుధవారం మృతి చెందిన పార్టీ నేత కొర్లకుంట నాగమల్లేశ్వర రావు కుటుంబాన్ని పరామర్శించడానికి వెళ్లిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి పోలీసులు ఆంక్షలు విధించడం, పర్యటనను భగ్నం చేసేందుకు ప్రయత్నించడంపై ఆమె బుధవారం స్పందించారు. నగరిలోని తన నివాస కార్యాలయంలో ఆమె మాట్లాడుతూ.. ఆంక్షలు, షరతులు, బెదింపులు, నోటీసులు, బారికేడ్లు జగనన్న అభిమాన సునామీని ఆపలేకపోయాయన్నారు. 'రోడ్లు మూసేస్తే మాకేంటీ.. పోలీసులను అడ్డుపెడితే మాకేంటీ.. జగనన్న కోసం అడ్డంకులు ఎదుర్కొని వస్తాం, మా నరాల్లో ప్రవహించే రక్తం జననేతను చూడాలని పరితపిస్తోంది' అంటూ పొలాల గట్లపై జన ప్రవాహం ద్విచక్ర వాహనాల్లో తరలివచ్చిందన్నారు. ముళ్ల దారులు వారికి జాతీయ రహదారులుగా కనిపించాయన్నారు. తగ్గేదేలే అంటూ.. జగనన్నను చూడడానికి జనం తరలివచ్చారన్నారు. ప్రభుత్వ వేధింపులు భరించలేక వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్త కొర్లకుంట నాగమల్లేశ్వరరావు ఆత్మహత్య చేసుకుంటే, ఆయన కుటుంబాన్ని జగనన్న పరామర్శించడానికి వెళ్లడం తప్పా అని ప్రశ్నించారు. ఆ పార్టీ కార్యకర్తలు చనిపోయినప్పుడు చంద్రబాబు వెళ్లి ఆ కుటుంబాలను పరామర్శించలేదా? అని రోజా ప్రశ్నించారు. ఆంక్షలు పెట్టి ప్రజాదరణ కలిగిన నాయకుడిని అడ్డుకోవాలని చూడడం ఏ మాత్రం సబబుకాదన్నారు.

సమగ్రశిక్ష ఉద్యోగుల బదిలీలకు దరఖాస్తులు

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా లోని సమగ్రశిక్ష ప్రాజెక్టు, కేజీబీవీల్లో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగు లు బదిలీలకు దరఖాస్తు చేసుకోవాలని ఆ శాఖ అడిషనల్ ప్రాజెక్ట్ కో ఆర్డినేటర్ వెంకటరమణ తెలిపారు. సమగ్రశిక్ష శాఖ, కేజీబీవీల్లో పనిచేస్తున్న ఉద్యోగులు స్పౌజ్, ఇతర వ్యక్తిగత కారణాలతో బదిలీలను కోరిన ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్ సేవల సిబ్బందికి బదిలీలకు అవకాశం కల్పించారన్నారు. రాష్ట్ర సమగ్రశిక్ష శాఖ అధికారులు జారీ చేసిన బదిలీల షెడ్యూల్ మేరకు జిల్లాలో అర్హులైన సిబ్బంది బదిలీలకు తప్పనిసరిగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. కేజీబీవీల్లో బోధన, బోధనేతర సిబ్బంది, సమగ్రశిక్ష శాఖ పరిధిలో ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్ సిబ్బంది ఐఈఆర్‌పీలు, పీటీఐలు, సీఆర్‌ఎంటీలు, మండల స్థాయి అకౌంటెంట్‌లు, సైట్ ఇంజినీర్‌లు, ఎంఐఎస్ కో ఆర్డినేటర్‌లు, డేటా ఎంట్రీ ఆపరేటర్‌లు, మెసెంజర్లు, ఆఫీస్ సబార్డినేట్‌లు 21వ తేదీ 5 గంటలలోపు కార్యాలయంలో అందించాలని కోరారు.

తల్లులకు బాబు ఎగనామం

- చంద్రబాబు పాలనపై మాజీ ఉప ముఖ్యమంత్రి మండిపాటు



బాబు ఏడాది పాలనపై వెన్నుపోటు పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న మాజీ ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి

కార్వేటినగరం : నీకు 15 వేలు.. నీకు 15 వేలు అంటూ ప్రచారంలో ఊదరగొట్టిన చంద్రబాబు నేడు తల్లికి వందనం పేరుతో విద్యార్థుల తల్లులకు ఎగనామం పెట్టారని రాష్ట్ర మాజీ ఉప ముఖ్యమంత్రి నారాయణ స్వామి ధ్వజమెత్తారు. బుధవారం మండల పరిధిలోని అల్లాగుంట ఇందిరా కాలనీ వద్ద కూటమి ఏడాది పాలనపై వెన్నుపోటు పుస్తకాన్ని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలసి ఆవిష్కరించారు. అనంతరం మాజీ ఉప ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అమ్మ ఒడి పథకం ద్వారా 84 లక్షల తల్లుల ఖాతాల్లో డబ్బులు జమ చేశారని గుర్తు చేశారు. చంద్రబాబు అందరికీ తల్లికి వందనం అందిస్తానని చెప్పిన నేడు సాంకేతిక సమస్యల పేరుతో లక్షల మందికి మోసం చేశారని ఆరోపించారు. ఆంగ్ల మాధ్యమాన్ని తొలగించి పేదలకు అన్యాయం చేశారన్నారు.

పాఠశాలల విలీనం పేరుతో పేద విద్యార్థులకు చదువును దూరం చేసేందుకు కుట్ర పన్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. గత జగనన్న ప్రభుత్వంలో మామిడి రైతులకు రూ.30 అందిస్తే నేడు చంద్రబాబు ప్రభుత్వం రూ.5 కూడా చెల్లించక పోవడం దారుణం అన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర రైతు విభాగం కార్యదర్శి చందురాజు, మండల మాజీ కన్వీనర్ ధనంజయవర్మ, ఎంపీటీ మురగయ్య, సింగిల్ విండో మాజీ అధ్యక్షుడు లోకనాథరెడ్డి, మాజీ సర్పంచ్‌లు అమీద్, కుప్పారెడ్డి, మునికృష్ణ, నందగోపాల్, దేవరాజ్, స్టీఫెన్, దనశేఖర్‌యాదవ్, గాంధీ,ఆశీర్వాదం తదితరులు పాల్గొన్నారు.

మామిడి రైతుల ముట్టడి

– సిఫార్సులకు టోకెన్లు ఇస్తున్నారని మండిపాటు



ఫ్యాక్టరీ వద్ద ఆందోళన చేస్తున్న రైతులు

పూతలపట్టు(కాణిపాకం) : పూతలపట్టు మండలం పోలవరంలోని పళ్ల గుజ్జు పరిశ్రమను బుధవారం మామిడి రైతులు ముట్టడించారు. స్థానిక రైతులకు టోకెన్లు ఇవ్వకుండా సిఫార్సులతో టోకెన్లు ఇచ్చేస్తున్నారని ఫ్యాక్టరీ ఎదుట ఆందోళన చేపట్టారు. ఫ్యాక్టరీ నిర్వాహకులతో వాగ్వాదానికి దిగారు. సిఫార్సులతో వచ్చే వారికి ఎలా టోకెన్లు ఇస్తారని నిలదీశారు. విషయం తెలుసుకున్న ఆర్డీఓ శ్రీనివాసులు అక్కడికి చేరుకొని ఫ్యాక్టరీ నిర్వాహకులతో మాట్లాడారు. దీంతో వాగ్వివాదం సద్దుమణిగింది. ఈ క్రమంలో మామిడి కాయలు లోడింగ్ చేసుకొచ్చిన ట్రాక్టర్లు క్యూ కట్టాయి.

చదువు'కొన'లేం!

- ఫీజుల పేరుతో ప్రైవేట్ స్కూళ్ల దోపిడీ
- ఖాళీ అవుతున్న సామాన్యుల జేబులు
- నోటీసు బోర్డుల్లో ప్రదర్శించని ఫీజుల వివరాలు
- కూటమి పాలనలో జాడలేని ఫీజు నియంత్రణ కమిటీలు
- పర్యవేక్షణలో విద్యాశాఖ అధికారులు విఫలం

చిత్తూరు కలెక్టరేట్ : ప్రభుత్వ నిబంధనల మేరకు ఒకటో తరగతి నుంచి మూడో తరగతి వరకు గ్రామీణ ప్రాంతాల్లో రూ.8 వేలు, మండల కేంద్రాల్లోని పాఠశాలల్లో రూ.10 వేలు, జిల్లా కేంద్రంలో రూ.13 వేలు చొప్పున ఫీజులు నిర్ధారించారు. అయితే 4, 5 తరగతులకు గ్రామీణ ప్రాంతాల్లో ఏడాదికి రూ.9 వేలు, పట్టణాల్లో రూ.11 వేలు, జిల్లా కేంద్రంలో రూ.13 వేలు, ఆరో తరగతికి గ్రామీణ ప్రాంతాల్లో రూ.11 వేలు, మండల కేంద్రాల్లో 15 వేలు, పట్టణాల్లో రూ.17 వేలు సంబంధిత పాఠశాలల స్టార్ రేటింగ్ మేరకు ఫీజులను నిర్ణయించి అడ్డగోలుగా దోచుకుంటున్నారు.

వైఎస్సార్‌సీపీ హయాంలో ఫీజుల నియంత్రణ

కార్పొరేట్, ప్రైవేట్ పాఠశాలల్లో ఫీజులపై అధ్యయనం చేసేందుకు ఐఏఎస్ అధికారులతో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఫీజు నియంత్రణ కమిటీలను నియమించింది. ఏ పాఠశాలలో ఎంత ఫీజు వసూలు చేస్తున్నారో ప్రాంతాల వారీగా ఈ కమిటీ పరిశీలించి నివేదిక రూపొందించి ప్రభుత్వానికి అందజేసేది. ఆ నివేదికల ఆధారంగా అధిక ఫీజులు వసూలు చేసే కార్పొరేట్, ప్రైవేట్ విద్యాసంస్థలపై చర్యలు తీసుకునేవారు. పాఠశాలల్లో మౌలిక వసతులు, బోధన, బోధనేతర సిబ్బంది తదితర అంశాలను పరిగణలోకి తీసుకుని గ్రామాలు, పట్టణాల్లో పాఠశాలలను ఐదు కేటగిరీలుగా విభజించారు. స్టార్ రేటింగ్ స్కూల్స్‌కు 1 నుంచి 10 వ తరగతి వరకు ఫీజులు సైతం ఫీజు నియంత్రణ కమిటీ సిఫార్సు చేసింది.

నిబంధనలకు తూట్లు

జిల్లాలోని ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలు నిబంధనలను తుంగలో తొక్కి అడ్డగోలుగా ఫీజులు వసూళ్లు చేస్తున్నారు. ఫీజు వసూళ్లు, సౌకర్యాల వంటి వివరాలను నోటీసు బోర్డులో ప్రదర్శించాలి. అయితే ఈ నిబంధనలను ప్రైవేట్ పాఠశాలలు పాటించడం లేదు. సిలబస్ మేరకు రాష్ట్ర ప్రభుత్వం ముద్రించే పుస్తకాలను బోధించాలి. కానీ కొన్ని పాఠశాలల్లో ఒక్కొక్క పబ్లికేషన్ పుస్తకాలను ఐటీఐ ఒరియెంటెడ్ పేరుతో విక్రయిస్తూ వాటినే బోధిస్తున్నారు. ఆరో తరగతి నుంచి తొమ్మిదో తరగతి వరకు ఇంటర్ స్థాయిలో ఉండే సిలబస్‌ను జోడించి సొంతంగా పుస్తకాలను విక్రయిస్తున్నారు. నిబంధనలు పాటించని పాఠశాలలను విద్యాశాఖ అధికారులు పట్టించుకోవడం లేదని పలువురు తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. విద్యాశాఖ అధికారులు ఇప్పటికైనా స్పందించి ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల్లో ఫీజుల దోపిడీకి అడ్డుకట్ట వేయాలని డిమాండ్ చేస్తున్నారు.

జిల్లాలోని ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల వివరాలు

ప్రాథమిక పాఠశాలలు	166
ప్రాథమికోన్నత పాఠశాలలు	79
ఉన్నత పాఠశాలలు	159
ప్రాథమిక, ఉన్నత పాఠశాలలు	18
ప్రాథమిక, హైస్కూల్ ప్లస్ పాఠశాలలు	06



ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల్లో విద్యార్థుల వివరాలు

ప్రాథమిక పాఠశాలల్లో విద్యార్థులు	31,922
ప్రాథమికోన్నత పాఠశాలల్లో విద్యార్థులు	11,750
ఉన్నత పాఠశాలల్లో విద్యార్థులు	29,303
ప్రాథమిక, హైస్కూల్ ప్లస్ పాఠశాలల్లో విద్యార్థులు	5,929

మామూళ్ల మత్తులో విద్యాశాఖ అధికారులు



విద్యాశాఖ అధికారులు ఫీజుల నియంత్రణపై ఏ మాత్రం పట్టించుకోవడం లేదు. నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల్లో ఇష్టానుసారంగా ఫీజులు వసూలు చేస్తున్నారు. ప్రభుత్వ నిబంధనలను పాటించడం లేదు. తనిఖీలు చేయాల్సిన విద్యాశాఖ అధికారులు మామూళ్ల మత్తులో జోగుతున్నారు. ఫలితంగా కూటమి ప్రభుత్వంలో సామాన్యులు నష్టపోతున్నారు. ఇప్పటికైనా విద్యాశాఖ అధికారులు స్పందించి అధిక ఫీజుల దందాను అరికట్టాలి. – ప్రవీణ్, ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి

భక్తులకు ఇబ్బందులు కలిగించొద్దు

కాణిపాకం : కాణిపాకంలోని శ్రీ వరసిద్ధి వినాయకస్వామి దేవస్థానాన్ని దేవదాయశాఖ ఆర్‌జేసీ చంద్రశేఖర్ ఆజాద్ సందర్శించారు. భక్తులకు కల్పిస్తున్న వసతి, మౌలిక సదుపాయాలపై పరిశీలించారు. క్యూలైన్లు, లడ్డు పోటు, పడితరం స్టోర్, అన్నదానం, సీసీ కెమెరాల కంట్రోల్ గదిని తనిఖీ చేశారు. తరువాత ఈవో కార్యాలయంలో ఆలయ అధికారులతో సమీక్షించారు. అధికారులతో మౌలిక సదుపాయాలపై చర్చించారు. భక్తుల సౌకర్యాలపై ఆయన పలు సూచనలు చేశారు. పరిశీలనలో ఏఈఓ లు కృష్ణారెడ్డి, రవీంద్రబాబు, హరి మాధవరెడ్డి, ప్రసాద్, ధనంజయ తదితరులున్నారు.

డీవైఈఓగా మహేశ్వరరావు

పుత్తూరు : డివిజన్ ఉప విద్యా శాఖాధికారిగా టి.మహేశ్వరరావు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. వెదురుకుప్పం మండల విద్యాశాఖాధికారిగా ఉన్న ఆయన ఉద్యోగోన్నతిపై ఇక్కడికి వచ్చారు. ఇక్కడ డీవైఈఓగా పనిచేసిన ప్రభాకర్‌రాజు ఇటీవల ఉద్యోగ విరమణ పొందారు.

సికిల్‌సెల్‌పై అవగాహన

చిత్తూరు రూరల్ (కాణిపాకం) : చిత్తూరు నగరంలోని జిల్లా వైద్య ఆరోగ్యశాఖలో బుధవారం సికిల్‌సెల్ అనీమియా గోడపత్రికను ఆవిష్కరించారు. డీఎంఅండ్‌హెచ్‌ఓ సుధారాణి ఈ పోస్టర్లను ఆవిష్కరించి..సికిల్ సెల్ తీవ్రత, నివారణ చర్యలపై అధికారులకు పలు సూచనలు చేశారు. అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని ఆదేశాలు జారీ చేశారు. కార్యక్రమంలో జిల్లా క్షయ నివారణ అధికారి వెంకట ప్రసాద్, పోగ్రాం ఆఫీసర్ గిరి పాల్గొన్నారు.

ఘర్షణ కేసులో జైలు, జరిమానా

చిత్తూరు లీగల్ : భూమి విషయమై వ్యక్తిపై దాడి చేసిన ఘటనలో అజయ్‌కుమార్, నవీన్ అనే ఇద్దరు అన్నదమ్ములకు ఏడాది జైలుశిక్ష, రూ.500 జరిమానా విధిస్తూ చిత్తూరులోని రెండో అదనపు జూనియర్ సివిల్ జడ్జి మాధవి బుధవారం తీర్పునిచ్చారు. అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ (ఏపీపీ) ఉమాదేవి కథనం మేరకు.. పూతలపట్టు నియోజకవర్గంలోని పి.కొత్తకోట పంచాయతీకు చెందిన అజయ్‌కుమార్, నవీన్ 2019లో గ్రామంలోని భూమిలో మొక్కలు నాటుతుండగా అదే గ్రామానికి చెందిన కోదండన్ ఈ విషయమై ప్రశ్నించాడు. ఇరుపక్షాల వైపు మాటలు పెరగడంతో అజయ్, నవీన్ ఇద్దరూ కలిసి కోదండపై దాడి చేశారు. ఈ ఘటనలో గాయపడ్డ కోదండ, పోలీసులకు ఫిర్యాదు చేయగా.. నిందితులపై కేసు నమోదు చేసి కోర్టుకు తరలించారు. నేరం రుజువు కావడంతో ఇద్దరికి జైలుశిక్ష, జరిమానా విధిస్తూ న్యాయస్థానం తీర్పునిచ్చింది.

కాణిపాకంలో టూరిజం చైర్మన్

కాణిపాకం : కాణిపాకంలోని శ్రీవరసిద్ధి వినాయకస్వామిని బుధవారం రాష్ట్ర టూరిజం కార్పొరేషన్ చైర్మన్ నూకసాని బాలాజీ స్వామిని దర్శించుకున్నారు. అలాగే ప్రముఖ సినీ నిర్మాత అంబికా కృష్ణ దర్శించుకున్నారు.

దళితుల సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలోని దళితుల సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం ఇవ్వాలని ఆల్ ఇండియా ఎస్సీ, ఎస్టీ ఐక్య వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీరంగపల్లి మునిస్వామి కోరారు. నూతనంగా జిల్లా సోషల్ వెల్ఫేర్ డీడీగా బాధ్యతలు స్వీకరించిన డీడీ విక్రమ్‌కుమార్ రెడ్డిని బుధవారం ఆ సంఘం నాయకులు కలిశారు. జిల్లాలోని పలు సమస్యలను డీడీ దృష్టికి తీసుకెళ్లారు. కార్యక్రమంలో జిల్లా దళిత సంఘాల సమాఖ్య ప్రధాన కార్యదర్శి గోవిందన్, నాయకులు మార్కొండయ్య, చెంగల్‌రాయులు పాల్గొన్నారు.


బెంగళూరు విమానాశ్రయంలో చెవిరెడ్డిని అరెస్టు చేసి తీసుకెళ్తున్న సిట్ అధికారులు

వైఎస్సార్‌సీపీలో క్రియాశీలకంగా వ్యవహరించే నేతలను కూటమి ప్రభుత్వం టార్గెట్ చేసింది. ప్రతిపక్ష పార్టీని నిర్వీర్యం చేయాలనే లక్ష్యంతో కుట్రలకు తెరతీసింది. రాష్ట్రవ్యాప్తంగా వైఎస్సార్‌సీపీ కీలక నాయకులపై కక్షగట్టింది. వైఎస్ జగన్ వెంట నడిచేవారిని వేధించేందుకు పన్నాగాలు పన్నుతోంది. వెంటాడి మరీ అరెస్టులు చేయించి పైశాచికానందం పొందుతోంది. అందులో భాగంగానే లిక్కర్ స్కామ్ అంటూ మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డిని సర్కారు మంగళవారం అర్ధరాత్రి అరెస్టు చేయించింది. అన్యాయంగా అపనిందలు మోపి అప్రతిష్టపాలు చేసేందుకు.. పోలీసులను అడ్డుపెట్టుకుని ప్రజాదరణను అణచి వేసేందుకు యత్నిస్తోంది.



తిరుపతి ఎస్వీయూనివర్సిటీ వద్ద అంబేడ్కర్ విగ్రహానికి వినతి పత్రం ఇస్తున్న వైఎస్సార్ సీపీ నేతలు

కక్షగట్టి కేసులు

వైఎస్సార్‌సీపీ కీలక నేతలను వేధిస్తున్న ప్రభుత్వం

- లిక్కర్ స్కామ్ అంటూ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి అక్రమ అరెస్టు
- అపనిందలతో అప్రతిష్టపాలు చేసేందుకు యత్నం
- గతంలో ఆయన వద్ద పనిచేసిన వారికీ తప్పని వేధింపులు
- ఎట్టకేలకు అరెస్ట్ చేయించి కూటమి నేతల పైశాచిక ఆనందం
- సాయం చేయడానికి వెళ్లినా.. కార్యకర్తల పరామర్శకు వెళ్లినా కేసులే..!

సాక్షి, టాస్క్‌ఫోర్స్ : జిల్లాలో రెడ్‌బుక్ రాజ్యాంగం కుట్రలు పరాకాష్టకు చేరాయి. మాజీ ప్రజాప్రతినిధులే లక్ష్యంగా కూటమి ప్రభుత్వంలోని కొందరు పెద్దల డైరెక్షన్‌లో అధికారులు పని చేస్తూ తప్పుడు కేసులు బనాయిస్తున్నారు. ఇప్పుడు తప్పులు కేసులు పెడుతున్న అధికారులు.. రేపనేది ఒకటి ఉంటుందని.. ప్రభుత్వం మారితే తమ పరిస్థితి ఏంటనేది ఆలోచన లేకుండా ప్రవర్తిస్తున్నారు. తాజాగా జిల్లాలో చంద్రగిరి మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డిని అరెస్టు చేసి అధికారంలోకి వచ్చిన రోజు నుంచి చెవిరెడ్డి కుటుంబంపై కక్ష సాధించేందుకు కూటమి ప్రభుత్వంలోని కొందరు కుట్రలు పన్నుతూ వచ్చారు. అయితే నిత్యం ప్రజల మధ్య ఉండే చెవిరెడ్డి ఎటువంటి తప్పులు చేయరని అందరికీ తెలుసు. అయితే ఇటీవల ఎర్రావారిపాళెం మండలంలో ఓ బాలికపై అఘాయిత్యం జరిగిందని ఆమె తండ్రి చెవిరెడ్డికి ఫోన్ చేసి సాయం చేయమని అడిగితే.. ఆయన అక్కడకు వెళ్లి ఆడబిడ్డకు సాయం చేసినందుకు పోక్సో కేసు పెట్టారు.. ఆ కేసులో అరెస్టు చేయాలని చూసినా ఆ బిడ్డ తల్లిదండ్రులే మీడియా ముందుకు వచ్చి చెవిరెడ్డిపై తాము ఫిర్యాదు చేయలేదని చెప్పడంతో పోలీసులు వెనకడుగు వేశారు.

లిక్కర్ కేసులో ఎలా ఇరికించారంటే..!

ఎన్నికల సమయంలో తెలంగాణ రాష్ట్ర సరిహద్దుల్లో రూ.8 కోట్లు పోలీసులకు పట్టుబడితే దానిని ఎన్నికల అధికారులు సీజ్ చేశారు. ఆ నగదుకు సంబంధించిన వారు వ్యాపార నిమిత్తం తరలిస్తుండగా పట్టుబడినట్టు చెబుతూ అందుకు తగిన ఆధారాలను కోర్టుకు, విజయవాడ పోలీసు కమిషనర్‌కు, ఎన్నికల అధికారులకు కూడా అందించారు. దానిపై కోర్టులో కేసు నడుస్తుండగానే చెవిరెడ్డి దగ్గర గతంలో పనిచేసిన గన్‌మెన్ గిరిని సిట్ అధికారులు తీసుకువెళ్లి బెదిరించి ఎన్నికల్లో పట్టుబడిన డబ్బుతో పాటు రూ.200 నుంచి రూ.250కోట్లు చెవిరెడ్డి తరలించినట్టుగా తప్పుడు స్టేట్‌మెంట్ తీసుకున్నారని అరెస్టుకు ముందు చెవిరెడ్డి మీడియాకు వివరించారు. గన్‌మెన్ గిరి ఇచ్చిన వివరాల మేరకు మరో గన్‌మెన్ మదన్‌రెడ్డి, గతంలో చెవిరెడ్డి దగ్గర వ్యక్తిగత సహాయకులుగా పనిచేసిన బాలాజీ, నవీన్ పేర్లను కూడా ఆ కేసులో ఇరికించారని, వారందరినీ భయపెట్టి చెవిరెడ్డి తీసుకురమ్మంటేనే ఆ డబ్బులు తరలించినట్టుగా స్టేట్‌మెంట్లు రికార్డు చేశారని మీడియా ముందు చెవిరెడ్డి స్వయంగా వెల్లడించారు.

ఇంతమందిని వేధించి, నరకం చూపించడం కన్నా తనను నేరుగా అరెస్టు చేసుకోవచ్చని కూడా చెప్పారు. అయితే సిట్ అధికారులు మాత్రం చెవిరెడ్డికి బెయిల్ లభించకుండా చేయడానికి అన్ని విధాలుగా స్టేట్‌మెంట్లు తయారు చేసుకున్న తరువాతే ఆ పనిచేశారు. మదన్‌రెడ్డి డీజీపీకి రాసిన లేఖతో ఖంగుతిన్న సిట్ అధికారులు ఏమాత్రం ఆలస్యం చేయకుండా చెవిరెడ్డి అరెస్టుకు రంగం సిద్ధం చేశారు. ఆ సమయంలో ఆయన విజయవాడలోనే ఉన్నట్టు తెలిసినా సిట్ అధికారులు ఎందుకు అరెస్టు చేయలేదనేది ప్రశ్నార్థకం.

నేరుగా అరెస్టు చేసుకోండని సవాల్ చేసినా..

ఏ తప్పు జరగని లిక్కర్ స్కాం కేసులో చెవిరెడ్డిని అక్రమంగా ఇరికించారు. అంతేకాదు.. అరెస్టు చేసిన తరువాత బెయిల్ రాకుండా చేయడానికి ఆయన దగ్గర గతంలో పనిచేసిన వారందరినీ వేధించి మరీ స్టేట్‌మెంట్లు తీసుకున్నట్టు స్వయంగా చెవిరెడ్డి మీడియాకు తెలిపారు. చెవిరెడ్డి దగ్గర పనిచేసిన వారందరికీ సిట్ అధికారుల వేధింపులు మాత్రం తప్పలేదు. ఇంతమందిని వేధించడం వెనుక తప్పుడు కేసుల్లో చెవిరెడ్డిని ఇరికించడానికి చేసిన ప్రయత్నమే అనేది ఆయన దగ్గర గన్‌మెన్‌గా పని చేసిన మదన్‌రెడ్డి ఇటీవల డీజీపీకి రాసిన లేఖతో తేటతెల్లమైంది. ఆ లేఖతో అప్పటి వరకు సిట్ అధికారులు చేసిన టార్చర్‌ను సోషల్ మీడియా వేదికగా చెవిరెడ్డి స్వయంగా బయటకు తేవడంతో మీడియాలో వరుస కథనాలు ప్రసారమయ్యాయి. సిట్ అధికారులు తప్పుడు సాక్ష్యాలు సృష్టించడానికి సామాన్యులను నరకం చూపుతున్నారనే విషయం బహిర్గతం కావడంతో చేసిన తప్పు కప్పి పుచ్చుకునేందుకు, ఆ విషయాన్ని దారి మళ్లించేందుకు చెవిరెడ్డిని అరెస్టు చేయడం ఒక్కటే మార్గమని సిట్ అధికారులు భావించారు. అందుకే ఎలాంటి ఎఫ్ఐఆర్ కాపీని చెవిరెడ్డికి ఇవ్వకుండా, కేసు పెట్టినట్టు చెప్పకుండా విజయవాడలోనే తిరుగుతున్న చెవిరెడ్డిని పట్టుకోకుండా.. లుక్‌అవుట్ నోటీసులు జారీ చేసి విదేశాలకు వెళ్తుంటే బెంగళూరు విమానాశ్రయంలో పట్టుకున్నట్టు సిట్ అధికారులు కలరింగ్ ఇచ్చారనే విమర్శలు వైఎస్సార్‌సీపీ నేతల నుంచి వ్యక్తమవుతున్నాయి.

ఎల్లో నేతల పైసాచిక ఆనందం

ఏపీ లిక్కర్ స్కాం కింద సిట్ అధికారులు చెవిరెడ్డిని అరెస్టు చేయడంతో కూటమి ప్రభుత్వంలోని పెద్దలు పైసాచిక ఆనందం పొందుతున్నారని చెవిరెడ్డి కుటుంబ సభ్యులు, సన్నిహితులు ఆరోపిస్తున్నారు. రాజకీయాలకు అతీతంగా సాయం చేయడంతో పాటు ఎవరినీ ఇబ్బంది పెట్టని చెవిరెడ్డికి ఇన్ని కష్టాలు రావడంపై ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చెవిరెడ్డికి న్యాయం జరిగే వరకు పోరాడుతామని, ఆ కుటుంబానికి అండగా నిలబడతామని గ్రామస్తులు, బంధువులు స్పష్టం చేస్తున్నారు. చెవిరెడ్డి అరెస్టుపై కూటమి ప్రభుత్వం కక్షకట్టిందని ఈ రాష్ట్ర ప్రజలకు సుస్పష్టమైంది.

ఏడాదిగా ఏపీలో అరాచక పాలన



జరగని స్కాంలో మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి పేరు చేర్చి అక్రమంగా అరెస్ట్ చేయడం దారుణం. ఏడాది నుంచి రాష్ట్రంలో కూటమి అరాచక పాలనకు అంతులేకుండా పోతోంది. ప్రజాప్రతినిధుల వద్ద గన్‌మెన్‌లుగా పనిచేసిన పోలీసులను సైతం లాక్కెళ్లి అబద్ధపు వాంగ్మూలం ఇవ్వమని చిత్రహింసలకు గురిచేయడం ఏపీలోని కూటమి పాలనకే చెల్లింది. మా నాయకుడు వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పల్నాడు పర్యటన కార్యక్రమం నుంచి జనం దృష్టి మరల్చడానికే చెవిరెడ్డిని రాత్రికి రాత్రే అరెస్టు చేశారు. అక్రమ కేసులు, అరెస్టులతో భయభ్రాంతులకు గురి చేయాలనుకోవడం వారి అవివేకానికి నిదర్శనం. ప్రజల నుంచి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి వస్తున్న ఆదరణను చూసి భయపడి సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేష్ డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారు. సీఎం చంద్రబాబు, మంత్రి లోకేష్ తాటాకు చప్పుళ్లకు భయపడే ప్రసక్తే లేదు.

– భూమన కరుణాకర రెడ్డి, వైఎస్సార్‌సీపీ తిరుపతి, చిత్తూరు జిల్లాల అధ్యక్షుడు

టోకెన్ ఉన్న రైతులకే అనుమతి : ఎస్పీ

గుడిపాల : టోకెన్లు పొందిన రైతులను వరుస క్రమంలో పంపించేందుకు చర్యలు చేపట్టామని ఎస్పీ మణికంఠ చందోలు అన్నారు. బుధవారం గుడిపాల మండలంలోని ఫుడ్ అండ్ ఇన్స్ జ్యూస్ ఫ్యాక్టరీని ఆయన సందర్శించారు. ఇందులో ఫ్యాక్టరీలోని పలు విభాగాలను తనిఖీ చేసి అక్కడ భద్రతా ఏర్పాట్లు, ఫ్యాక్టరీలో నిల్వ చేసే సామర్థ్యాన్ని సమీక్షించి, ఫ్యాక్టరీ యాజమాన్యంతో సమావేశమై ప్రాసెసింగ్ మరియు నిల్వ ప్రక్రియలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. భద్రతాపరంగా సీసీ కెమెరాలు, నైట్ గార్డుల విధులు తదితర అంశాలను పరిశీలించిన ఎస్పీ పలు సూచనలు చేశారు. రైతులు వచ్చే వేళ ట్రాఫిక్ నియంత్రణకు కావలసిన ఏర్పాట్లు , పార్కింగ్ స్థలాలు కేటాయించి అవినీతికి అవకాశం లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం రైతులతో ఎస్పీ మాట్లాడుతూ ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఫ్యాక్టరీ నిల్వ సామర్థ్యాన్ని బట్టి రైతులకు వారికి కేటాయించే క్రమంలో లోనికి అనుమతిస్తామన్నారు. కార్యక్రమంలో వెస్ట్ సర్కిల్ సీఐ శ్రీధర్ నాయుడు, ఎస్ఐ రామ్మోహన్, ఫుడ్ అండ్ ఇన్స్ ఫ్యాక్టరీ జనరల్ మేనేజర్ చంద్రశేఖర్ పాల్గొన్నారు.

ఎస్ఆర్‌పురం ఎంఈఓపై చీటింగ్ కేసు

గుడిపాల : ఎస్ఆర్‌పురం మండల విద్యాశాఖాధికారి సబర్మతిపై చీటింగ్ కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రామ్మోహన్ తెలిపారు. ఎస్ఐ కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. బుచ్చన్నకండ్రిగ గ్రామానికి చెందిన ప్రియాంక (29) అనే మహిళ చిత్తూరులోని అపోలో హాస్పిటల్‌లో స్టాఫ్ నర్సుగా పనిచేస్తోంది. ఇదే గ్రామానికి చెందిన సబర్మతి ప్రస్తుతం ఎస్ఆర్ పురం మండల విద్యాశాఖాధికారిగా పనిచేస్తోంది. ఆమె గతంలో గుడిపాల మండలంలోని నరహరిపేట హైస్కూల్ ప్రధానోపాధ్యాయులుగా పనిచేశారు. అప్పట్లో అమరావతిలో ఫైనాన్స్ ఉన్నతాధికారులు, ఎమ్మెల్యేలు, ఎంపీలతో సన్నిహిత సంబంధాలు ఉన్నాయని ప్రభుత్వ ఉద్యోగాలు ఇప్పిస్తానని ప్రియాంకను వంచించింది. ఆ మేరకు తనకు తెలిసిన వ్యక్తి రూపేష్‌కు ఫోన్‌పే చేయాలని చెప్పడంతో విడతల వారీగా రూ.1,55,000 ఇవ్వడంతో పాటు తమ స్నేహితురాలు ఈశ్వరి తన భర్తకు ఉద్యోగం కావాలని రూ. లక్షతో పాటు రూ.5 లక్షలు అందించినట్లు ప్రియాంక ఫిర్యాదు చేశారన్నారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు ఎంఈఓపై చీటింగ్ కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రామ్మోహన్ తెలిపారు.

కుప్పం ఎంఈఓ సస్పెన్షన్

- హాకింగ్స్ స్కూల్ రద్దుపై వేటు

కుప్పం : కుప్పం ఎంఈఓ మహబూబ్‌బాషాను సస్పెండ్ చేస్తూ ఉన్నత విద్యాశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. కుప్పం వైఎస్సార్‌సీపీ మున్సిపాలిటీ వైస్ చైర్మన్, హాకింగ్ స్కూల్ అధినేత హఫీజ్‌కు సంబంధించిన హాకింగ్ ఇంటర్నేషనల్ స్కూల్ రద్దుపై నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించారని ఆరోపిస్తూ సస్పెండ్ చేసింది. రాష్ట్ర అనుమతులతో పాటు సీబీఎస్‌సీ సిలబస్ అనుమతులు హాకింగ్ స్కూలుకు ఉండడంతో ఈ విషయాన్ని ఎంఈవో ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. గత నెల రోజుల క్రితం హాకింగ్ స్కూలుకు అనుమతులు రద్దు చేస్తూ ప్రభుత్వం ప్రకటన చేయడంపై ఎంఈవో మహబూబ్‌బాషా పాఠశాలను సందర్శించారు. హాకింగ్ పాఠశాల రికార్డులను పరిశీలించి కేంద్రానికి సంబంధించి సీబీఎస్‌సీ సిలబస్ అనుమతులు ఉన్నాయని పూర్తి స్థాయిలో పాఠశాలను మూసివేయలేరని ఉన్నతాధికారులకు నివేదికలు పంపారు. దీనిపై ఆగ్రహించిన ఉన్నతాధికారులు ఆయనపై మండిపడినట్లు సమాచారం. జిల్లా స్థాయిలో విద్యా ఉన్నతాధికారులు హాకింగ్ ఇంటర్నేషనల్ స్కూలు అనుమతులు రద్దు చేస్తే సీబీఎస్‌సీ సిలబస్ అనుమతులు ఉన్నాయని స్థానిక ఎంఈవో నివేదికలు ఇవ్వడం పై ఆయన్ను సస్పెండ్ చేసినట్లు తెలుస్తోంది.

ఇన్‌చార్జ్‌గా గుడుపల్లె ఎంఈవో

కుప్పం ఎంఈవో మహబూబ్‌బాషాను ప్రభుత్వం సస్పెండ్ చేయడంతో ఆయన స్థానంలో గుడుపల్లె ఎంఈవో శ్రీదేవిని ఇన్‌చార్జ్‌గా నియమించారు. గురువారం నుంచి ఆమె కుప్పం ఇన్‌చార్జ్‌గా ఎంఈవోగా బాధ్యతలు స్వీకరిస్తున్నట్లు తెలిపారు.

పెళ్లి ముసుగులో కిరాతకం

- సినీ ఫక్కీలో హత్య
- సరోజ సాధారణ మరణమని నమ్మించిన వైనం
- తీరా చిన్నోడి సీక్రెట్‌తో అసలు కథ వెలుగులోకి
- సరోజ హత్యను ఛేదించిన పోలీసులు
- నిందితురాలిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలింపు

చిత్తూరు రూరల్ (కాణిపాకం) : సరోజది సహజ మరణమేని ఊరంతా నమ్మించింది. అంత్యక్రియలు పూర్తయ్యాయి. చివరకు చిన్నోడి సీక్రెట్ అసలు చిట్టా విప్పింది. సరోజది సహజ మరణం కాదని..హత్యేనని తేలింది. దీంతో హంతకురాలు కటకటాలపాలైంది. చిత్తూరు తాలూకా పోలీసులు నిందితురాలిని బుధవారం రాత్రి అరెస్ట్ చేసి రిమాండ్ తరలించారు. తాలూకా ఎస్ఐ మల్లికార్జున వివరాల ఇలా.. సరోజ (49), నదియాది చిత్తూరు మండలం చెర్లోపల్లి యాదవ కాలనీ. వీరు వేరువేరు కులాలు అయినా పక్కపక్కనే నివాసం ఉంటూ స్నేహంగా ఉంటున్నారు. సరోజకు కన్నన్ అనే కొడుకు ఉండగా..నదియాకు ఒక కుమార్తె ఉంది. నదియా తన కుమార్తెను కన్నన్‌కు ఇచ్చి పెళ్లి చేయాలని నిర్ణయం తీసుకుంది. ఈ విషయాన్ని సరోజకు చెప్పగా..ఇద్దరి మధ్య గొడవ తలెత్తింది. దీంతో నదియా సరోజ అడ్డు తొలగించుకోవాలని చూసింది. ఈనెల 12వ తేదీన పక్కా ప్లాన్‌తో సరోజ ఇంటికెళ్లింది. అక్కడున్న ఓ బుడ్డోడిని బయటికి పంపింది. తర్వాత ఇద్దరు మహిళలు కలసి మద్యం సేవించారు. ఆపై పథకం ప్రకారం నదియా వెంట తెచ్చుకున్న నల్ల కవరును సరోజ ముఖానికి చుట్టి..దిండుతో అదిమేసింది. ప్రాణం పోయిందని నిర్ధారించుకున్న తర్వాత నదియా పరారైంది. ఇదంతా దొంగ చాటున చూసిన ఓ బుడ్డోడు భయపడి పరుగులు తీశాడు. తీరా ఇంటికి వచ్చిన కొడుకు సుజాత నిద్రలోనే ఉందని అనుకుంటాడు. 13వతేదీ ఉదయం చుట్టు పక్కల వాళ్లు సుజాత మరణించినట్లు గుర్తించి..సహజ మరణమని మధ్యాహ్నం అంత్యక్రియలు పూర్తి చేశారు. ఆపై బుడ్డోడు ఊరు జనానికి నీకోక సీక్రెట్ చెబుతానని ఊరంతా ఊదాడు. ఈ విషయాన్ని ఎవరికీ చెప్పొద్దని ఒట్టువేయించుకున్నాడు. ఈ విషయం ఆ నోటా.. ఈనోటా పడి కొడుకు చెవిలో పడింది. బుడ్డోడి కథతో నదియా హత్య విషయం బయటకు పొక్కింది. కుటుంబీకులు ఇచ్చిన ఫిర్యాదుతో పోలీసులు రంగంలోకి దిగారు. బుడ్డోడి సీక్రెట్ కథ విని నదియాను విచారించారు. ఈ విచారణలో సుజాతను హత్య చేసినట్లు నిందితురాలు ఒప్పుకుంది. దీంతో తాలూకా పోలీసులు నిందితురాలని అరెస్ట్ చేసి బుధవారం రాత్రి రిమాండ్‌కు తరలించారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి


నాగప్ప (ఫైల్)

కుప్పం రూరల్ : ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్‌కు గురై వ్యక్తి దుర్మరణం పాలైన సంఘటన కుప్పం మండలం నూలుకుంట గ్రామంలో బుధవారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు వివరాలు ఇలా.. నూలుకుంట గ్రామానికి చెందిన నాగప్ప (64) జీవనోపాధి కోసం చికెన్ దుకాణం నిర్వహిస్తున్నాడు. బుధవారం కోళ్లను కోసి బాయిలర్‌లో వేసి క్లీన్ చేసే సమయంలో బాయిలర్‌కు వచ్చే విద్యుత్ తీగకు ఎలుకలు కొరికి ఉన్న విషయం గుర్తించలేదు. దీంతో బాయిలర్ స్విచ్ వేయగానే నాగప్ప విద్యుత్ షాక్‌కు గురయ్యాడు. కొన ఊపిరితో ఉన్న నాగప్పను కుటుంబ సభ్యులు కుప్పం ఏరియా ఆస్పత్రికి తరలించారు. అక్కడికి చేరుకోగానే నాగప్ప మృతి చెందినట్లు తెలిపారు. కాగా నాగప్పకు భార్య , నలుగురు పిల్లలు ఉన్నారు.

పొలానికి రాకుండా దౌర్జన్యం

– బాధిత మహిళా రైతు ఆవేదన



పట్టా పాసు పుస్తకాన్ని చూపుతున్న బాధితురాలు, కుటుంబీకులు, టీడీపీ నేత అండతో భూమిని జేసీబీతో చదును చేసిన పక్కభూమి రైతు

పలమనేరు : తమ పొలాన్ని ఆక్రమించుకొనేందుకు ఓ టీడీపీ నేత ప్రమేయంతో కొందరు ప్రయత్నిస్తున్నారని తమ పొలం వద్దకు రానివ్వకుండా దౌర్జన్యం చేస్తున్నారని బైరెడ్డిపల్లి మండలం చిక్కనపల్లికి చెందిన బాధితులు రమాదేవి కుటుంబీకులు బుధవారం ఆవేదన వ్యక్తం చేశారు. వారు మాట్లాడుతూ తమకు శెట్టిపల్లి రెవెన్యూలో 2.72 సెంట్ల డీకేటీ భూమి ఉందని దాన్ని 20 ఏళ్లుగా సాగుచేస్తున్నామని తెలిపారు. ఇదే భూమిపై బ్యాంకులో రుణం కూడా పొందామన్నారు.అయితే బేలుపల్లికి చెందిన ఓ టీడీపీ నేత ప్రోద్బలంతో తమ పొలాన్ని పక్కనున్న భూమి వారికి ఇవ్వడానికి రంగం సిద్ధం చేసి జేసీబీతో తమ పొలాన్ని వారి పొలంలో కలిపేలా పనులు చేశారన్నారు. దీనిపై తాము రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేస్తే వారు టీడీపీ నాయకులను కలసి పరిష్కరించుకోవాలని తామేమీ చేయలేమని చెప్పారన్నారు. దీంతో బేలుపల్లికి చెందిన టీడీపీ నేతవద్దకెళితే తాను చెప్పినంత డబ్బులిస్తే మీ భూమి మీకు దక్కుతుందని లేదంటే మీభూమి పక్కనున్న వాళ్లకి చేసేస్తామని బెదిరిస్తున్నాడని వాపోయారు.

గోల్డ్ లోన్ కేసులో పోలీసుల అదుపులో మరికొందరు

పలమనేరు : పట్టణంలోని కనకదుర్గ గోల్డ్‌లోన్ ఫైనాన్స్ కంపెనీలో జరిగిన మోసం కేసులో మరికొందరిని పలమనేరు పోలీసులు బుధవారం అదుపులోకి తీసుకొని విచారిస్తున్నట్లు తెలిసింది. గత మార్చిలో ఈ కేసుకు సంబంధించి ఎనిమిది మందిని అరెస్ట్ చేసిన విషయం తెలిసిందే. ఇందులో సంబంధం ఉన్న మరికొందరిని పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. ఈ విషయమై స్థానిక సీఐ నరసింహరాజును వివరణ కోరగా మరికొందరిని విచారిస్తున్నామని తదుపరి వివరాలు వెల్లడిస్తామన్నారు.

అక్రమ రిజిస్ట్రేషన్‌పై కొరడా

- ఆర్కే గార్డెన్స్‌కు జరిమానా విధింపు
- జిల్లా రిజిస్ట్రార్ విచారణలో అక్రమాలు బహిర్గతం
- రూ.10.80 లక్షల స్టాంపు డ్యూటీ చెల్లించాలంటూ ఆదేశం
- ఫలించిన సమాచార హక్కుల వేదిక పోరాటం


ఆర్.కె.గార్డెన్ ఫంక్షన్ హాల్

పుత్తూరు : మండల పరిధిలోని ఆర్కే గార్డెన్స్ ఫంక్షన్ హాల్ యజమాని రవీంద్రన్‌కు రూ.10.80 లక్షల స్టాంప్ డ్యూటీతో పాటు అపరాధ రుసుం చెల్లించాలంటూ తిరుపతి జిల్లా రిజిస్ట్రార్ జి.శ్రీరామ్‌కుమార్ ఆదేశించారు. ఈ మేరకు ఆర్డర్ కాపీని గత మే నెల 29వ తేదీన జారీ చేశారు. ఆర్డర్ కాపీ అందుకున్న 15 రోజుల్లోపు స్టాంప్ డ్యూటీ మొత్తాన్ని చెల్లించాలని లేని పక్షంలో ఇండియన్ స్టాంప్స్ సెక్షన్ 1899 చట్టం ప్రకారం చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు.

నివాస ఖాళీ స్థలంగా చూపడంతో..

స్థానిక ఎన్జీఓ కాలనీలో నివాసం ఉంటున్న ఎం.రవీంద్రన్ పుత్తూరు మండల పరిధిలోని ఉత్తరపుకండ్రిగ పంచాయతీ చిన్నబ్బనాయుడు కండ్రిగ వద్ద ఆర్కే గార్డెన్ ఫంక్షన్ హాల్ నిర్మించారు. ఆయన 2023 డిసెంబర్ 13, 14 తేదీలలో పుత్తూరు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో తన కుమార్తె ప్రత్యూష పేరిట సదరు ఆస్తిని రిజిస్ట్రర్ చేయించారు. ఈ సందర్భంగా సదరు ఆస్తిని నివాస ఖాళీ స్థలంగా చూపుతూ డిక్లరేషన్ ఇచ్చారు. ఆస్తి మొత్తం విలువ రూ.1,08,96,604గా పేర్కొన్నారు.

సమాచార హక్కుల వేదిక ఫిర్యాదు

పుత్తూరు మండలంలోని ఆర్కే గార్డెన్స్ నిర్మాణానికి పంచాయతీ నుంచి, తుడా కార్యాలయం నుంచి పొందిన అనుమతులను కోరుతూ స్థానిక సమాచార హక్కుల వేదిక కార్యదర్శి కె.మురగారెడ్డి ఆర్టీఐ ద్వారా సమాచారాన్ని కోరడంతో అసలు విషయం బయట పడింది.

కేవలం రూ.2.18 లక్షలు చెల్లించి..

స్టాంప్ డ్యూటీ రూ.12.94 లక్షలు కాగా, రవీంద్రన్ ఇచ్చిన తప్పుడు డిక్లరేషన్ ద్వారా కేవలం రూ.2.18 లక్షలు మాత్రం చెల్లించినట్లు విచారణలో తేటతెల్లం అయింది. దీంతో డెఫిసిట్ రిజిస్ట్రేషన్ ఫీజు రూ.4,720తో కలిపి మొత్తం రూ.10,80,520 చెల్లించాలంటూ రవీంద్రన్‌ను ఆదేశించారు.

జిల్లా రిజిస్ట్రార్ విచారణ ఇలా..

- సమాచార హక్కుల వేదిక వారు ఆర్టీఐ ద్వారా అడిగిన వివరాల మేరకు తిరుపతి జిల్లా రిజిస్ట్రార్ చేపట్టిన విచారణలో వాస్తవాలు వెలుగు చూశాయి.
- జిల్లా రిజిస్ట్రార్ ఆదేశాల మేరకు పుత్తూరు ఎంపీడీఓ స్థల పరిశీలన చేసి ఇచ్చిన నివేదికలో సర్వే నంబర్ 145-1ఏ2, 145-2సి2లో 2023 డిసెంబర్ నాటికే ఆర్కే గార్డెన్ ఫంక్షన్ హాలు నిర్మాణం పూర్తయిందని తెలిపారు.
- పుత్తూరు సబ్ రిజిస్ట్రార్ సైతం స్థల పరిశీలన చేసి శాశ్వత భవనాలు ఉన్నట్లు గుర్తించి, మార్కెట్ విలువను దాచిపెట్టి రిజిస్ట్రేషన్ జరిగినట్లు నివేదిక ఇచ్చారు.
- ఆర్‌సీసీ నిర్మాణం 2,591 చదరపు అడుగుల్లో జరిగిందని, ఏసీసీ నిర్మాణం 17,361 చదరపు అడుగులుగా నివేదికలో పొందుపరిచారు.
- రవీంద్రన్ తెలిపిన ఆస్తి విలువ రూ.1.8 కోట్లు కాగా విచారణలో మొత్తం ఆస్తి విలువ రూ.6.47 కోట్లుగా లెక్కగట్టారు.

ఫిర్యాదు మేరకే విచారణ చేపట్టాం

ఆర్కే గార్డెన్స్ క్రయ విక్రయాలపై వచ్చిన ఫిర్యాదు మేరకే విచారణ చేపట్టాం. విచారణలో పుత్తూరు ఎంపీడీఓ 2023 డిసెంబర్‌కు ముందే ఆ నిర్మాణాలపై నోటీసులు ఇచ్చినట్లు నివేదికలో పేర్కొన్నారు. 2023 డిసెంబర్‌లో జరిగిన ఈ రిజిస్ట్రేషన్ స్టాంప్స్ చట్టం సెక్షన్ 27కి వ్యతిరేకంగా ఉన్నట్లు తేలింది. దీంతో పూర్తి స్థాయి స్టాంప్ డ్యూటీ చెల్లించాలని ఆదేశించాం.

– జి.శ్రీరామ్‌కుమార్, జిల్లా రిజిస్ట్రార్, తిరుపతి